ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలి

- లారీలు ఎక్కువగా కేటాయించాలి
- మాజీ ఎమ్మెల్యే రాజయ్య
- చిల్పూరు, మల్కాపూర్ కొనుగోలు కేంద్రాల సందర్శన

చిల్పూరు, మే 13: ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు త్వరగా తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంతోపాటు మల్కాపూర్‌లోని కొనుగోలు కేంద్రాలను మంగళవారం సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలోని చిల్పూరు, మల్కాపూర్, పల్లగుట్ట, లింగంపల్లి, శ్రీపతిపల్లి, నష్కల్, రాజవరం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోయిందని తెలిపారు. కాంటాలైన ధాన్యాన్ని ఎక్కువ సంఖ్యలో లారీలు కేటాయించి మిల్లులకు తరలించాలన్నారు. మిల్లుల్లో ధాన్యాన్ని త్వరగా దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతును రాజు చేసిన ఘనత కేసీఆర్‌దని అన్నారు. కొనుగోళ్లలో రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు, ఎరువుల సరఫరా, రైతు రుణమాఫీ, రైతుబీమాలో జాప్యం జరుగుతోందని వివరించారు. చిల్పూరు గ్రామ మాజీ ఉప సర్పంచ్ పిట్టల మహేందర్, గ్రామశాఖ అధ్యక్షుడు మాచర్ల ప్రవీణ్‌కుమార్, నలిమెల రమేశ్, రైతులు రాజు, అశోక్, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు శ్రీలత, రజిత, మంజుల పాల్గొన్నారు.

చిల్పూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా గోపయ్య ఏకగ్రీవం

జనగామ, మే 13 (నమస్తే తెలంగాణ) : ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పజ్జూరి గోపయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం విజయ ఫంక్షన్ హాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరిశెట్టి మునీందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బజ్జూరి రవీందర్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడిగా పజ్జూరి గోపయ్య, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ సదానందం, కోశాధికారిగా కాసర్ల రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా రాష్ట్ర అధ్యక్షుడు, ఆల్ ఇండియా అసోసియేషన్‌తో ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. గతంలో మాదిరిగానే జిల్లా ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ వెల్ఫేర్ సంఘానికి సభ్యులందరూ సహకరించాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గూడెల్లి మధుసూదన్‌రెడ్డి, నడిపెల్లి సీతారాంరెడ్డి, ధనుంజయ, మహేష్, పిన్న సురేందర్ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనగామ జిల్లా కార్యవర్గం

క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలి

జనగామ చౌరస్తా, మే 13: బాల బాలికలు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్న కోచ్‌లకు జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా మంగళవారం కలెక్టరేట్‌లో క్రీడా వస్తువులు పంపిణీ చేశారు. అదేవిధంగా సీఎం కప్ క్రీడల్లో విజేతలైన పలువురు క్రీడాకారులకు మెడల్స్‌తోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను జిల్లాలోని 14 ఏళ్ల లోపు బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మే 1 నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహిస్తున్న క్రీడా శిబిరాల్లో 516 మంది బాలబాలికలు శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. వాలీబాల్, ఫుట్‌బాల్, మార్షల్ ఆర్ట్స్, బాక్సింగ్, సాఫ్ట్‌బాల్ క్రీడల్లో మరింత రాణించాలని కాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి బీ వెంకట్‌రెడ్డి, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడా వస్తువులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

శుచీ.. శుభ్రత లేదు..

- జిల్లా కేంద్రంలో యథేచ్ఛగా ఆహార కల్తీ
- హోటళ్లు, దాబాల్లో భోజనంలోకి నిల్వ చేసిన పదార్థాలు
- అధ్వానంగా బార్లు, రెస్టారెంట్లు, మెస్‌లు
- ఆహార తనిఖీ అధికారి లేక ఇష్టారాజ్యం

జనగామ, మే 13 (నమస్తే తెలంగాణ) : నోరూరో.. సెలవనో.. హోటళ్లు, దాబాలు, మెస్‌లు, బిర్యానీ సెంటర్లకు వెళ్లి భోజనం తిన్న ప్రజలు అనారోగ్యానికి గురై హాస్పిటల్ పాలవుతున్నారు. రాత్రి మిగిలిపోయిన పదార్థాలనే వేడిచేసి వడ్డిస్తున్నారు. జనగామ పట్టణంలోని టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, మెస్‌లు, దాబాలు, బిర్యానీ సెంటర్లు, రెస్టారెంట్లు, బార్లు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. జిల్లాలో ఆహార తనిఖీ విభాగంలో అధికారులు, సిబ్బంది కొరత కారణంగా పట్టించుకునే నాథుడు లేక ఇష్టారాజ్యంగా ఆహార కల్తీకి పాల్పడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. జనగామ పట్టణంతోపాటు మండల కేంద్రాల్లోని హోటళ్లలో శుచీ శుభ్రత పాటించడంలేదు. గతంలో పలు టిఫిన్ సెంటర్లు, దాబాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో అధికారుల ఆకస్మిక పరిశీలనలో అపరిశుభ్రత కొట్టొచ్చినట్లు కనిపించింది. ఒకటి, రెండుసార్లు తనిఖీలతో హడావుడి చేసి పరిస్థితి మెరుగుపరుచుకోకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించినా కొద్దిరోజులకే యజమానులు మామూలు పరిస్థితికి వస్తున్నారంటే అధికారుల పర్యవేక్షణ ఎంత వరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. కిచెన్‌లో ఈగలు, దోమలతో అపరిశుభ్రంగా ఉండగా దుర్వాసన వస్తోంది. గతంలో జరిపిన తనిఖీల్లో రెండు, మూడు రోజులపాటు నిల్వ ఉంచిన మాంసాన్ని బిర్యానీల్లో వాడినట్లు వెలుగుచూసింది. జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, రఘునాథపల్లి, దేవరుప్పుల ప్రాంతాల్లోని హోటళ్లలోనూ ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. జనగామ జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో రద్దీ పెరిగింది. సెలవురోజుల్లో వివిధ సందర్భాల్లో హోటళ్లు, దాబాల్లో భోజనం చేసేవారి సంఖ్య పెరిగింది. హోటళ్ల బయట అందంగా, ఆకర్షించేలా అలంకరిస్తున్నా లోపల మాత్రం అందుకు విరుద్ధంగా ఉంటున్నాయి. కాగా, పట్టణంలోని ఆర్టీసీ చౌరస్తా, బస్టాండ్, హైదరాబాద్ రోడ్డు, రైల్వేస్టేషన్, నెహ్రూపార్కు, డీసీపీ కార్యాలయం వద్ద, ఆర్‌అండ్‌బీ అతిథిగృహం, తహసీల్దార్ కార్యాలయం ప్రాంతాల్లో చిన్నారులు తినే తినుబండారాలు విషతుల్యమనే ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో చిరుతిళ్లు తయారు చేసే కేంద్రాలున్నాయి. అనుమతులు ఉన్నాయని చెబుతున్నా సంబంధిత పత్రాలు మాత్రం లేవని తెలుస్తోంది. ఇక్కడ తయారు చేస్తున్న చిన్న సమోసాలను రోజూ రైళ్లలో పెద్ద ఎత్తున విక్రయిస్తుంటారు. వీటి తయారీకి నాసిరకం నూనె వాడుతుండగా, రైళ్లలో రూ.10కు పది సమోసాలను అమ్ముతున్నారు. పైగా ఈ పనుల కోసం బాల కార్మికులను ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ ఏనాడూ తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

నిల్వ ఉన్న చికెన్(ఫైల్)

ఆహార తనిఖీ విభాగం ఖాళీ

జిల్లా కేంద్రంలోని ఆహార తనిఖీ కార్యాలయం (అధికారులు, సిబ్బంది) మొత్తం ఖాళీగా ఉండటంతో ఆహార కల్తీ విషయంలో నిర్వాహకుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. జిల్లాలో 5,66,376 జనాభా 1,39,238 కుటుంబాలు నివసిస్తుండగా శాశ్వత అధికారి ఒక్కరు కూడా లేరు. ఆహార తనిఖీ విభాగం ప్రతి నెలలో తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాలి. గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఒక్కొక్కరికి నిర్ణీత లక్ష్యం ఉంటుంది. కానీ జిల్లా కేంద్రంగా ఏర్పడి ఏండ్లు గడుస్తున్నా అధికారి లేక కార్యాలయం వెలవెలబోతోంది. జూనియర్ అసిస్టెంట్ మినహా పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఇద్దరు ఫుడ్‌సేఫ్టీ అధికారులు, ఒక్క క్లర్క్, ఇద్దరు అటెండర్లు, ఒక కంప్యూటర్ ఆపరేటర్ కార్యాలయంలో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. 1985లో అప్పటి జనాభా ప్రాతిపదికన పోస్టులు మంజూరు చేయగా, ప్రస్తుతం జనాభా పది రెట్లు పెరిగినా ఆ విభాగంలో పాత విధానమే కొనసాగుతోంది. ఫలితంగా ఆహార తనిఖీ ప్రక్రియ జరగకపోవడంతో కల్తీ మాఫియా చెలరేగుతోంది. జనగామ జిల్లా ఇన్‌చార్జి అధికారిగా వరంగల్ అర్బన్ ఆహార తనిఖీ అధికారిగా వ్యవహరిస్తుండగా, వరంగల్‌లో విధులు నిర్వర్తించడం, కోర్టు కేసులకు హాజరుకావడంతోనే సరిపోతోంది.

గతంలో వివిధ శాఖల అధికారులతో పౌరసరఫరాల విజిలెన్స్ విభాగం ఉండేది. ఆహార తనిఖీలపై ప్రధాన దృష్టిసారించి దాడులు చేస్తూ కల్తీ వ్యాపారులపై కఠినంగా వ్యవహరించే ఆ విభాగాన్ని 2002లో రద్దు చేశారు. జిల్లాలో బార్లు, హోటళ్లు, కిరాణం, ఆయిల్ దుకాణాలు, వాటర్‌ప్లాంట్లలో తనిఖీ చేసి ఎప్పటికప్పుడు షాంపిల్స్ సేకరించాల్సి ఉంది. జనగామ – హైదరాబాద్ రోడ్డులోని దాదాపు 20కి పైగా ఉన్నా దాబాల్లో ఏ ఒక్కదానికి అనుమతి లేదు. వాటిలో ఇష్టారాజ్యంగా వన్యప్రాణుల మాంసాన్ని సైతం విక్రయిస్తూ విచ్చలవిడిగా ఆహార కల్తీకి పాల్పడుతున్నట్లు ప్రచారంలో ఉంది. జిల్లా కేంద్రంలోని మటన్ షాపుల్లో అనారోగ్యంతో చనిపోయిన మేకలు, గొర్రెలు కోసి అమ్ముతున్నట్లు తెలుస్తోంది. గొర్రెలు, మేకల వధశాలలో పశువైద్యాధికారి పరీక్షలు చేసి ఆరోగ్యకరంగా ఉందని నిర్ధారిస్తూ ముద్ర వేసిన తర్వాతే మాంసాన్ని విక్రయించాలి. కానీ కొద్దినెలలుగా జనగామలో పశువైద్యాధికారి పరీక్షలు, తనిఖీలు లేకుండానే వ్యాపారులు ఇష్టారాజ్యంగా మటన్, చికెన్ విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం.

అక్షరాస్యతలో అంతరాన్ని తగ్గించాలి

జనగామ చౌరస్తా, మే 13 : స్త్రీ, పురుషుల అక్షరాస్యతలో అంతరాన్ని తగ్గించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో డీఆర్డీఏ/సెర్ప్, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్), మహిళా శిశు సంక్షేమం, విద్యాశాఖ ఆధ్వర్యంలో న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం (ఎన్ఐఎల్‌పీ)పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్త్రీ, పురుషుల అక్షరాస్యతలో 19శాతం అంతరం ఉందని తెలిపారు. దీన్ని తగ్గించేందుకు జిల్లా యంత్రాంగం సమష్టిగా కృషి చేయాలన్నారు. జిల్లాలో చదువురాని వారితో పాటు బడి మధ్యలో మానేసిన వారి వివరాలను ఈనెల 19వ తేదీలోగా సర్వే ద్వారా సేకరించాలని ఆదేశించారు. సర్వే వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారులు వయోజన విద్య అధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి 15 రోజులకు ఒక సారి మండల స్థాయిలో, నెలకు ఒకసారి జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రతి సర్వేయర్ 35 మంది చదువు రానివారిని గుర్తించి వారికి నలుగురు స్వచ్ఛంద బోధకులను ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలో 14 ఏళ్లు పైబడి బడి మానేసిన పిల్లల్ని ఓపెన్ స్కూల్‌లో చేర్పించాలని పేర్కొన్నారు. 15ఏళ్లు నిండిన వారికి ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశం కల్పించాలని తెలిపారు. వయోజన విద్య ఏపీవో విజయ్‌కుమార్‌రెడ్డి, డీఆర్డీవో వసంత, డీడబ్ల్యూవో ఫ్లోరెన్స్, కమ్యూనిటీ మొబిలైజింగ్ వింగ్ సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

లబ్ధిదారులను త్వరగా గుర్తించాలి

ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాల అమలుకు జిల్లాలో లబ్ధిదారులను త్వరగా గుర్తించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలపై గూగుల్ మీట్ ద్వారా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే త్వరగా చేయాలన్నారు. సర్వే పూర్తయిన దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. అలాగే రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించేందుకు సిబిల్‌స్కోర్ పరిశీలించాలని ఆదేశించారు. కార్పొరేషన్ల వారీగా ఇప్పటివరకు ఎంత మంది సిబిల్ స్కోర్ తనిఖీ చేశారు? వాటిలో ఎంత మందిని అర్హులుగా గుర్తించారో వెంటనే నివేదిక అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఇద్దరు మున్సిపల్ కమిషనర్లు, 12 మండలాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

జనగామ సెయింట్ మేరీస్ హైస్కూల్ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

పాలిసెట్ ప్రశాంతం

జనగామ చౌరస్తా, మే 13: టీజీ పాలిసెట్ మంగళవారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసిందని ఆ పరీక్షల నిర్వహణ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఏ నర్సయ్య తెలిపారు. ఇంజినీరింగ్ డిప్లొమా, నాన్ ఇంజినీరింగ్, టెక్నాలజీ, వ్యవసాయ డిప్లొమా కోర్సుల్లో విద్యార్థుల ప్రవేశానికి జనగామ ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ కళాశాల, సెయింట్ మేరీస్ హైస్కూల్, స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు పరీక్ష సజావుగా కొనసాగిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,416 మంది విద్యార్థులకు 1,343 మంది పరీక్ష రాశారని, 73 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో బాలురు 96.08 శాతం, బాలికలు 93.67 శాతంతో కలిపి మొత్తం 94.84 హాజరు శాతం నమోదైనట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తుతో 144 సెక్షన్ అమలు చేసినట్లు పేర్కొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

శివ (ఫైల్)

దేవరుప్పుల, మే 13: మండలంలోని చౌడూరుకు చెందిన ఓ యువకుడు మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పానుగంటి ఎల్లయ్య – యాదమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. రెండో కుమారుడు పానుగంటి శివ(23) కారు డ్రైవింగ్ చేస్తూ సంపాదిస్తుండగా ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఆమె పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపంతో కొద్ది రోజులుగా స్వగ్రామం చౌడూరులోని తన ఇంట్లో నానమ్మతోపాటు ఉంటున్నాడు. ఉదయం ఆమె ఇంట్లో లేని సమయంలో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. పోలీసులు శివ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం జనగామ ఏరియా దవాఖానకు తరలించగా బుధవారం ఉదయం అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలిపారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

బాధిత కుటుంబాలకు పరామర్శ

చిల్పూరు, మే 13 : మండలంలోని మల్కాపూర్ బాధిత కుటుంబాలను స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పరామర్శించారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బొగి రాజు తండ్రి బొగి యాదగిరి, బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు కొట్టే సృజన తండ్రి కొట్టే వెంకటయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే టీ రాజయ్య మృతుల పార్థివదేహాలపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. జనగామ జిల్లా యువజన నాయకుడు, పల్లా యువసేన అధ్యక్షుడు కేశిరెడ్డి రాకేశ్‌రెడ్డి, మల్కాపూర్ బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు వెన్నం మాధవరెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు అలుగు అశోక్, మీనుగు రాజాభూపతి, మంతెన రాజు, వెముల రవి, బోగం సతీశ్, పెనుకుల యాదగిరి, పెనుకుల రాజు, కర్నెంటి శ్రీను, చింతల శ్రీను, దోరం రాజు పాల్గొన్నారు.

విరాళంగా రూ.50వేల చెక్కును గౌడ కులస్తులకు అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం అందజేత

లింగాలఘనపురం, మే 13 : మండలంలోని నేలపోగుల గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవం కంఠమహేశ్వరుడి ఆలయ పునర్నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి విరాళం అందజేశారు. గ్రామానికి చెందిన గౌడ కులస్తులు హైదరాబాద్‌కు వెళ్లి వంశీధర్‌రెడ్డి నివాసంలో కలిశారు. గ్రామంలోని కంఠమహేశ్వర స్వామి ఆలయం జీర్ణావస్థకు చేరిందని, పునర్నిర్మాణానికి ఆర్థికసాయం అందించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన రూ.50వేల చెక్కును అందించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నేలపోగుల గ్రామ తాజా మాజీ సర్పంచ్ దూసరి గణపతి, నాయకులు గైని ప్రవీణ్‌కుమార్, ఆకుల ఇస్తారి, కృష్ణ, దూసరి వెంకన్న, గైని కృష్ణ, మచ్చుపాటి వెంకన్న, సతీశ్, అనిల్, సోమశేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటా..

బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

దేవరుప్పుల, మే 13: గ్రామాల్లో బాధితులకు అండగా ఉంటానని పాలకుర్తి ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్వినీరెడ్డి అన్నారు. మండలంలోని మాధాపురం, కడవెండి గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆమె బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారి కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకుని తక్షణ ఆర్థికసాయం అందించారు. నాయకులు నల్ల శ్రీరాం, ఉప్పల సురేష్‌బాబు, శ్రీనివాస్ ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు

వరంగల్‌చౌరస్తా, మే 13: హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు అన్నారు. వరంగల్‌లోని జిల్లా కార్యాలయంలో మంగళవారం వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల పరిధిలోని ఐసీటీసీ, పీపీటీసీ, ఏఆర్‌టీ, డీఎస్ఆర్‌సీ, ఎన్‌జీవోస్ సంస్థల ద్వారా గుర్తించిన కేసుల వివరాలపై చర్చించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. సమాజంలో అవగాహన పెంచడం వల్లే హెచ్ఐవీ, ఎయిడ్స్‌ను నివారించడం సాధ్యం అవుతున్నదని తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతోపాటు బాధితులకు ఏఆర్‌టీ సెంటర్ల ద్వారా వైద్య సేవలు నిరాటంకంగా కొనసాగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆచార్య, హనుమకొండ జిల్లా డీటీసీవో డాక్టర్ హిమబిందు, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాకటర్ సూర్య ప్రకాశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వప్నమాధురి, సూపర్‌వైజర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత ఊరేగింపు

జఫర్‌గఢ్, మే 13 : ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీమాత ఊరేగింపు మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా జరిగింది. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఐదు రోజుల కిత్రం తమ కమిటీహాల్‌లో అమ్మవారిని ప్రతిష్ఠింపజేసి పూజలు చేశారు. మహిళలు రోజూ అమ్మవారిని రకరకాల పూలతో అలంకరించి అభిషేకాలు, మంగళహారతులతో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని గ్రామ పురవీధుల్లో భక్తిశ్రద్ధలు, భక్తిపాటలు, కీర్తనలు పాడుతూ ఊరేగించారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గొర్రెల దొంగలు అరెస్ట్.. రూ.60వేలు స్వాధీనం

తరిగొప్పుల, మే 13: గొర్రెలు చోరీ చేసిన వ్యక్తులను అరెస్ట్ చేసి, రూ.60వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీదేవి తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఎస్సై వివరాలు వెల్లడించారు. మండలంలోని అబ్దుల్ నాగారానికి చెందిన నీల కనకయ్య గొర్రెల కొట్టం నుంచి గండికోట సతీశ్, రాపోలు వంశీ, కొమ్మరాజుల రాకేశ్ 2024 డిసెంబర్‌లో 9 గొర్రెలు ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులను మంగళవారం అరెస్టు చేసి రూ.60వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LONG TERM COACHING
★BiPC-NEET & MPC-IIT Long Term Coaching Start on June, 1st, **SRI CHAITANYA JR. COLLEGE,** Hyd. Contact: K. ASHOK REDDY, A.O., **Cell: 9441884705.**
NTW-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

మాట్లాడుతున్న ఏసీపీ అంబటి నర్సయ్య

పెండింగ్ కేసులు లేకుండా చూసుకోవాలి

క్రైమ్ మీటింగ్‌లో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య

జఫర్‌గఢ్, మే 13 : సబ్ డివిజినల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో పెండింగ్ కేసులు లేకుండా చర్యలు తీసుకోవాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య ఆదేశించారు. జఫర్‌గఢ్ పోలీస్ స్టేషన్‌లో సబ్ డివిజినల్ స్థాయి క్రైమ్ మీటింగ్ మంగళవారం నిర్వహించారు. సబ్ డివిజినల్ పరిధిలోని పోలీస్ అధికారులతో క్రైమ్, శాంతి భద్రతలు, పెండింగ్ కేసులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించి ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలన్